# సుఖస్వప్నాలు

"భమిడిపాటి"

సూర్యోదయమయి చాలసేపయింది.

ప్రక్కవీడి బయటకి రాలేదింకా.

కాఫీత్రాగి గడివేడేసరికి పదిగంటలకు పైనయింది.

పీకేశినజుట్టు. డోకేశిన ముఖం. చాకలికి వేయని చిరుగుబట్టలు.

పట్టపగలు కుక్కలు వెంట బెడుతున్నాయి!

వీధి వీధినీ విచారగీతికలే! ఇంటనింటనూ కంటతడిబెట్టేవారే!

ఆదరించి అడిగేవారులేరు! దయదలచి దారిచూపేనారు లేరు!

పన్నెండు గంటలుకొట్టింది గడియారం.

బయలుదేరిన చోటుకే మళ్ళా చేరుకున్నా.

ఆకలివేస్తోంది. అరకానైనా చేతిలో లేదు!

అద్దంముందు కూర్చున్నా, అందంచూచుకుంటూ!

కళ్లలోకాంతి ముక్కుమీదుగా ప్రాకి మూతిమీద కలుస్తూంది!

తళతళలాడే చెంపలు నల్లబడ్డాయి!

విశాలమైన నుదురు చింపిరి జుత్తుతో సగానికిపైగా కప్పబడిపోయింది!

లోతుకుపోయినకళ్లు మూసుక పోతున్నాయి!

గరుకుగడ్డాం 'పరపర' లాడ్తూంది!

ఏమిటా రూపు!

సంగీతప్రియుడ్నయిన నాకు విషాదగీతికైనా ఆలాపన రాకుండావుంది!

గొంతు బొంగురుపోయి, మాట తడబడుతూంటే, మిత్రులు నవ్వారు!

—ప్రతిధ్వనిస్తోంది హృదయాంతర భాగంలో!—

ఎవరో తిడుతున్నారు!

హోటేల్ అయ్యరు కాదుగదా!

"నీకోనమస్కారం! పదోతారీఖు నగుబడుదూ?......

ఎవరూ?....బ్రదర్!......దయచేయండి....లోపలికి!"

"నీ వెవరయ్యా?"

.................................................

"నీతో నాకేంపని?"

.................................................

"ఆత డేడీ?"

వెళ్లిపోయాడు!

.................................................

అరరే! పిట్ట ఎగిరిపోయిందే!"

* * *

సుందరమగు నందనోద్యానం. —ప్రభాతకాలం.

అరుణ కిరణ కాంతులు, ఆకులు, పువ్వులు మీఁదపడి పంచుతున్నాయి తమ రంగుల్ని.

నయనానందకరమగు ప్రకృతిశోభ !

అచ్చటి గాలులు ఒకవిధమైన ఆనందాన్ని అందిస్తున్నాయి.

—అన్నిటిని మరిపిస్తూ—

ఎవరు వీరంతా? ప్రక్కకు తప్పుకుంటున్నారు !

నేనేం దేవేంద్రుడ ననుకున్నారా ?

నా ముఖంచూచి ముగ్ధులయ్యారా !

అందరిముఖాల్లో అమందానందా సూచనలే !

ఆహ్వానిస్తున్నారు !

సుందరభవనాలు ! ఆకసమునకు అంటుతున్నాయి.

—అన్ని సౌఖ్యములకు —అభినవమునకు — దగ్గరగా నిర్మించుకున్నారూ?—

ఎంతకాల మలా విహరించానో !

భవనపు గోడలు 'తళుక్కు' లాడే నిలువుటద్దాలు !

అన్నిటిలోనూ నాదివ్య మోహనాకార ప్రతిబింబమే !

సౌధమంతా నా కాంతే !

ఎవరిదా శ్రావ్యకంఠము ? గానము ! కాదు ! అమృతపానము !

జవాబిచ్చేదా ?

ఇంతవరకూ కూసే కోయిల ఊరకున్నాయేం ?

సిగ్గుపడ్డాయా ?

ఎవరది ? "దివ్యసుందరీ !" అలానిలబడిపోయారేం ?

అమృతవాహినికా ఆ తన్మయం !

....................................

బంగరు టుయ్యాలు !

ఊయల గొలుసుల బంగరుకాంతులు, మా మనసుల వెన్నెలకాంతులు ఊగుతున్నాయి.

"ఊగుదమా ప్రియురాలా !"

పక్షు లెగురుతున్నాయి.

ఆనందా రేకంలో అమరసౌఖ్యం అందుకున్నా !

* * *

'చురుక్కు'మంది చెయ్యి. 'చటక్కు'న తీశాను.

బాగా తెలివొచ్చింది.

సగముకాలిన సిగరెట్టుకు చెయ్యితగిలింది !

అందువలన తన ఆభరణం రాలింది ?

కోపంతో 'చురచుర' చూస్తోంది !

* * *

దుఃఖమయ జీవనంలో సుఖస్వప్నాలు!...స్వప్నాలు !